క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పాన్‌గల్: సీఎంఆర్ఎఫ్ పథకం వరంలాంటిదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాము యాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన రాంచందర్ కూతురుకు మంజూరైన రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం ఆయన అందజేశారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

పాన్‌గల్: ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని మండల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మహాధర్నాపై ప్రచారం నిర్వహించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని అన్ని విద్యా సంస్థలల్లో, ప్రజా ప్రతినిధులకు బోధించాలన్నారు. రాజ్యాంగ గ్రంథాన్ని పౌరులందరికి పంపిణీ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అశోక్, శివ, బలరాం, సంధ్యారాణి, రామకృష్ణ, లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబళాపురం, నాగసానిపల్లి, నాగరాల, సేరుపల్లిలో పిరమిడ్ సంస్థ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయులు ఆదివారం ధ్యానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు కొంత సమయం ధ్యానానికి కేటాయించాలన్నారు. ధ్యానం చేయడం వలన శరీరంలో ఉన్న ఎలాంటి వ్యాధులైన తగ్గి, భవిష్యత్‌లో తిరిగి రావన్నారు. బీపీ, షుగర్ వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కృష్ణ, శోభిత, సుజాత, రాములు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు నోచుకోని పాఠశాలలు



అమరచింత: ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో తరగతి గదులు శుభ్రతకు నోచుకోవడం లేదు. బడిబాట కార్యక్రమం ద్వారా బడిఈడు పిల్లలను గుర్తించాలని నిత్యం పట్టణంలో విద్యార్థుల తల్లితండ్రులను కలుస్తున్నారు. ఆయా పాఠశాలలో స్వీపర్‌లు లేకపోవడం, మధ్యాహ్న భోజన కార్మికులకు అందిస్తున్న పారితోషికం అందించలేక పోవడంతో తరగతి గదుల శుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీఉన్నత పాఠశాలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాల తరగతి గదులు అపరిశుభ్రతకు ఆనవాలుగా మారాయి.

విద్యా సమస్యలపై దృష్టి సారించాలి



శాంతినగర్: విద్యా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా, జిల్లా కార్యదర్శి హరీష్‌లు అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను సోమవారం గద్వాలకు రానున్న సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను కోరారు. వడ్డేపల్లిలో ఎస్సీ, బీసీ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. శాంతినగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, కళాశాలలు హాస్టళ్లపై నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, నరేష్, మురళీకృష్ణ, యేసేపు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గోపాల్‌పేట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన వనపర్తి పట్టణ కేంద్రంలో ఆదివారం వెలుగు చూసింది. ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఖలీల్ (38) ఎలక్ట్రీషియన్ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. నాలుగేళ్లుగా భార్యా, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. ఇదే క్రమంలో మూడు నాలుగు రోజులుగా ఇంట్లో నుంచి బయటికి రాలేదు. ఆదివారం ఉదయం నుంచి దుర్వాసన ఎక్కువగా రావడంతో కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చూడగా మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరువుల తవ్వకం ప్రారంభం

- అమృత్ సరోవర్ పథకంలో రూ.73.11 లక్షల నిధుల మంజూరు
- 5 గ్రామాల్లో పనులు పూర్తి



ఖిల్లాఘనపురం శివారులో చెరువు తవ్వకం పనులు చేస్తున్న కూలీలు

ఖిల్లాఘనపురం: వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా చెరువులు ఏర్పాటు చేసి భూగర్భజలాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ సరోవర్ యోజనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చెరువులను తవ్వడం ప్రారంభించారు. వర్షపు నీరు నేరుగా చెరువుల్లోకి చేరి భూమిలోకి ఇంకేలా అధికారులు ఈ పథకాన్ని రూపొందించారు.

ఏడు గ్రామాల్లో..

మండలంలోని ఏడు గ్రామాల్లో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువులను తవ్వుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 5 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మండలంలోని కర్నెతండా, దొంతికుంట తండా, ఖిల్లాఘనపురం, సల్కెలాపురం, పర్వతాపురం, కోతులకుంట తండా, రుక్కన్నపల్లిలో చెరువుల తవ్వకం పనులు చేపట్టగా ఇప్పటికే రుక్కన్నపల్లి, ఖిల్లాఘనపురం, సల్కెలాపురం, పరవతాపూర్, కర్నెతండాల్లో పనులు పూర్తయ్యాయి.

రూ.73.11లక్షలు మంజూరు..

ఖిల్లాఘనపురం, రుక్కన్నపల్లి, సల్కెలాపురంలో కొత్తగా, పర్వతాపురం, దొంతికుంట తండా, కర్నెతండా, కోతులకుంటతండాలో గతంలో తవ్విన చెరువుల పునరుద్ధర చేసేందుకు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.73.11 లక్షల నిధులు మంజూరు చేసింది. వాటిలో ఇప్పటి వరకు చేపట్టిన పనులకు గాను రూ.34.22 లక్షల నిధులు ఖర్చు చేశారు.

భూగర్భజలాలను పెంచేందుకు...

వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకి భూగర్భజలాలను పెంపొందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చెరువుల తవ్వకాలను చేపట్టింది. మండలంలో 7 గ్రామాల్లో పనులు ప్రారంభించగా, ఇప్పటికే 5 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి.



– విజయ్‌కుమార్, ఎంపీడీఓ

డంపింగ్‌యార్డు తొలగించాలని డిమాండ్



పట్టణంలోని డంపింగ్‌యార్డు

అమరచింత: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తొలగించాలని సమీపంలోని చేనేత ఉత్పత్తుల సంఘం కార్మికులు కలెక్టర్‌కు విన్నవించిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిత్యం పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి డంపింగ్ యార్డులో వేయడంతో నిత్యం దుర్వాసన వస్తుందని సమీపంలో చేనేత వస్త్రాలను తయారు చేస్తున్న కార్మికులు వాపోతున్నారు. ప్రస్తుతం డంపింగ్ యార్డుకోసం స్థలాన్ని కేటాయించామని త్వరలోనే ఇక్కడి నుంచి తొలగిస్తామని అధికారులు చెప్పుకోవడమే పనిగా మారిందని, ఇప్పటి వరకు వాటి గురించి పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన డంపింగ్ యార్డు ఉండడంతో చెత్తను ఎప్పుడు పడితే అప్పుడు అంటిపెట్టడంతో వాటి నుంచి వచ్చే పొగతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ చొరవ తీసుకుని డంపింగ్‌యార్డును తరలించాలని కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పెబ్బేరులో పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, నాయకులు

పెబ్బేరు: పట్టణంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం దివ్యాంగులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ మాట్లాడుతూ.. దివ్యాంగులకు పింఛన్ రూ.3,016 నుంచి రూ.4,016 పెంచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, దిలీప్‌కుమార్, గొని బుచ్చారెడ్డి, వెంకటేష్, కురుమూర్తి, సాయినాథ్, విశ్వరూపం, శంకర్‌నాయుడు, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలారాణి, పృథ్వీరాజ్, కురుమయ్య, మహేష్‌గౌడ్, శ్రీనివాసులు, శివసాగర్, ఎల్లమ్మ, లక్ష్మి, రాము, రాజవర్ధన్ పాల్గొన్నారు.



శ్రీరంగాపురం మండలంలో..

కరెంట్ కష్టాలు తీరేదెన్నడో?



అమరచింతలోని విద్యుత్ సబ్‌స్టేషన్

- విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న తీరని కోతలు

అమరచింత: మున్సిపాలిటీలో విద్యుత్ కోతలు తీవ్రమయ్యాయి. ప్రైవేట్ వ్యక్తుల చేతిలో విద్యుత్ సరఫరా వ్యవస్థ ఉండటంతో ఎప్పుడు పడితే అప్పుడు ఎల్‌సీలు తీసుకోవడం, గంటల తరబడి సరఫరా నిలిపివేయడం పరిపాటిగా మారింది. సమాచారం ఎవరిని అడగాలో అర్థం కాలేని స్థితిలో వినియోగదారులు ఉన్నారు. పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన విద్యుత్ కష్టాలు మాత్రం తప్పడం లేదు. ప్రభుత్వం రైతులకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్న ఇక్కడ మాత్రం రైతులకే కాదు, గృహ వినియోగదారులకు సైతం రోజులో 18 గంటల విద్యుత్ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. పట్టణానికి ఆరేళ్ల కిందట 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కావడంతో ఇక పట్టణంతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కరెంట్ కష్టాలు తీరుతాయని ప్రజలు సంబరపడ్డారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గతంలో అమరచింతలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఉన్నప్పుడు సబ్‌స్టేషన్ పరిధిలోని మస్తీపురం, నందిమళ్ల, పస్పుల, ఉంద్యాల, మిట్టనందిమళ్ల ఫీడర్ చానల్‌లకు నిరంతరం విద్యుత్‌ను అందించేవారు. అప్పుడప్పుడు ఆయా గ్రామాల్లో సమస్య వస్తే తప్పా సరఫరా నిలిపేవారు కాదు. ప్రస్తుతం గాలివీచినా, వర్షం వచ్చిన వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారు.

కాలం చెల్లిన విద్యుత్ తీగలు..

పట్టణంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా ప్రజలకు కరెంట్ కష్టాలు మాత్రం తీరడంలేదు. పట్టణమంతా సింగల్‌ఫేజ్ తీగలు అమర్చి నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన అధికారులు, పట్టణంలోని కాలం చెల్లిన విద్యుత్ తీగలను స్తంభాలకు మార్చలేకపోతున్నారు. దీంతో ఎప్పుడు స్తంభాలకు ఉన్న విద్యుత్ తీగలు తెగిపడతాయో అన్న ఆందోళనలో పట్టణ ప్రజలు కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత విద్యుత్ తీగలను పట్టణంలో తొలగించి నిరంతరంగా విద్యుత్ సరఫరా అయ్యే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేద్దాం

శాంతినగర్: గద్వాలలో పలు కార్యాలయాల ప్రారంభం అనంతరం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, భార్గవ్‌యాదవ్, గౌతమ్‌రెడ్డి ఆదివారం కోరారు. ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ యూత్ నాయకులు పర్యటించారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభమెప్పుడో?

- నిర్మాణానికి రూ. 1.50 కోట్ల మంజూరు
- చిరు వ్యాపారులకు 40 గదుల నిర్మాణం



ప్రారంభంకాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం

అయిజ: పట్టణంలో చిరు వ్యాపారుల కోసం ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని నిర్మించింది. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు, చిరుధాన్యాలు విక్రయించుకునే వీధి విక్రయదారులు సుమారు 300 మంది రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్నారు. అయితే రోడ్డు పక్కన వ్యాపారం కొనసాగిస్తుండడంతో ప్రయాణికులకు అది ఆటంకంగా మారింది. వస్తువులు కొనేందుకు వచ్చిన విక్రయదారులు మోటార్ సైకిళ్లు, ఆటోలను రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తుండడంతో పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఉన్న ప్రధాన రహదారి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్‌ను క్లియర్ అయ్యేందుకు సమయం పడుతుండటంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటిని అధిగమించేందుకు అధికారులు అయిజ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో వాగు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం చేపట్టింది.

నిధులు మంజూరు..

మున్సిపాలిటీలో నాలుగు సంవత్సరాల కిందట రూ.1.50 కోట్ల నిధులతో మొత్తం 40 గదులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం చేపట్టారు. అయితే అదనంగా ప్రహరీ నిర్మాణానికి రూ.15 లక్షలు, స్టీట్ వైడింగ్‌కు రూ.10 లక్షలు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 5 లక్షలు, రీటైనింగ్ వాల్‌కు రూ.15 లక్షలు, గ్రీనరీకి రూ.3 లక్షల నిధులు 18 నెలల కిందట మంజూరయ్యాయి. వీటి నిర్మాణం నత్తనడకన కొనసాగుతోంది.

నత్తనడకన నిర్మాణం పనులు..

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో పూలు, పండ్లు, కూరగాయలు, మాంసం, ఆహార ధాన్యాలు విక్రయించే వ్యాపారులు పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన విక్రయాలు జరుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తరుచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇంటిగ్రేటెడ్ నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన విక్రయాలు



రోడ్డు పక్కన పండ్లు కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం పూర్తయితే బాగుండు. అక్కడ వ్యాపారం చేసేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. నిర్మాణ పనులు పూర్తి చేసి చిరు వ్యాపారులకు దుకాణాలు కేటాయించాలి.

– వీరేష్, పండ్ల వ్యాపారి, అయిజ

వ్యాపారం అంతంతే..



ప్రధాన రోడ్డు పక్కన పూలు విక్రయిస్తున్నా. పూలపై దుమ్ము, దూళి పడుతుండటంతో గిరాకీ తక్కువగా ఉంది. ట్రాఫిక్ సమస్య కారణంలో వాహనాలు నిలిపి కొనుగోలు చేసేందుకు ఇష్టపడటం లేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.

– అలీ భాష, పూల వ్యాపారి, అయిజ

త్వరలో ప్రారంభిస్తాం..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిర్మాణం 95 శాతం పూర్తయ్యింది. మంజూరైన నిధులతో పనులు వేగవంతం చేశాం. ఎక్కడ కూడా నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకున్నాం. కొన్ని నిర్మాణదశలో ఉన్నాయి. త్వరలోనే పనులు పూర్తిచేసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభిస్తాం.

– గోల్కొండ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, అయిజ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులతో ఎన్పీ వెంకటేష్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర పుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్పీ వెంకటేష్‌రు. జిల్లా కేంద్రంలో శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. క్రీడల్లో రాణించేవారు చదువులో కూడా ముందుంటారని తెలిపారు. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకదిర నర్సింలు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, ప్రశాంత్, ఆకారపు నరేందర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న జిల్లా కవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కవి సమ్మేళనంలో జిల్లా కవులు కె.లక్ష్మణ్‌గౌడ్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ 'శిథిలమే శిఖరం' కె.లక్ష్మణ్‌గౌడ్ 'నూతన శకం' కవితలను చదివారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు జిల్లా కవులను శాలువా, నగదుతో సత్కరించారు.



సమ్మేళనంలో కవితను చదువుతున్న డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్

జాతీయ రహదారి వెంట నిర్మాణాల తొలగింపు



ఎనుగొండ వద్ద ఇళ్లను జేసీబీతో తొలగింపజేస్తున్న, అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్–రాయచూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–167) వెడల్పులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎనుగొండలో ఆదివారం నాలుగు ఇళ్లను మున్సిపల్, రెవెన్యూ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు తొలగించారు. వాస్తవానికి వెడల్పు పనులు రెండేళ్ల క్రితమే చేపట్టినా వీటిని అప్పట్లో అలాగే వదిలేశారు. ఇటీవలే బాధితులకు వేరేచోట పట్టాలతో పాటు పరిహారం చెల్లించడంతో ఇప్పుడు పూర్తి చేశారు. కాగా బాధితులెవరూ అడ్డుకోలేదని ఈ పనులు సాఫీగా జరుగుతున్నాయని టీపీఓలు లక్ష్మీపతి, శ్రీకాంత్ తెలిపారు.

బీభత్సం సృష్టిస్తున్న వానరాలు



జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో సంచరిస్తున్న కోతులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో వానరాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ నగర్, రైల్వేస్టేషన్, పాతబజార్ ప్రాంతాలలో వీటి బెడద అధికమయ్యింది. పదుల సంఖ్య నుంచి వందల్లోకి వృద్ధి చెందడంతో నిత్యం ప్రయాణీకులకు కష్టాలు తప్పటం లేదు. రైల్వేస్టేషన్ సమీపంలో పాడుబడిన రైస్‌మిల్‌ను కోతులు అడ్డాగా చేసుకుని చెట్లపై నివాసం ఏర్పరచుకున్నాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు స్టేషన్, ఎస్‌వీపీనగర్‌లలోకి గుంపులుగా వస్తూ రైల్వేస్టేషన్‌లో దర్జాగా తిరుగుతున్నాయి. ప్రయాణీకులను భయభ్రాంతులకు గురి చేస్తుంటాయి. చేతి రుమాలు మొదలుకుని సంచులు, పండ్లు, బిస్కట్లు ఇలా ప్రయాణీకుల చేతిలో ఏం ఉన్నా లాక్కెళ్లిపోతున్నాయి. ముఖ్యంగా రెండు గుంపులుగా ఏర్పడి దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల సమస్యపై కాలనీవాసుల తోపాటు స్టేషన్ అధికారులు జిల్లా కలెక్టర్, మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. కోతులతో వేగలేకపోతున్నామని అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. పలు సందర్భాల్లో వాటి దాడిలో చాలామంది గాయపడ్డారని అంటున్నారు. మరికొందరు ఇళ్ల వద్ద ఉన్న చెట్లను కొట్టేయ్యాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని, కోతులను పట్టణానికి దూరంగా అడవి ప్రాంతాల్లో వదిలివేయాలని కోరుతున్నారు.

తరలించేందుకు చర్యలు తీసుకుంటాం



రైల్వేస్టేషన్ ప్రాంతం, ఎస్‌వీపీ నగర్‌తోపాటు పాతబజార్, శ్రీరాంనగర్‌ల నుంచి కోతుల బెడద విషయంపై ఫిర్యాదులు వస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లటంతోపాటు మా పాలకమండలిలో చర్చించి అటవీప్రాంతంలోకి తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులు, అటవీశాఖ అధికారులతో మాట్లాడి వారికి సమస్యను వివరించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

–దోరేపల్లి లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

కాలు విరగొట్టుకున్నా..



కోతులు ఒక్కసారిగా మీదకు రావటంతో గోడపైనుంచి దుకాల్సి వచ్చింది. ఆ సమయంలో నా కాలు విరిగి నాలుగు నెలలు ఇంటికే పరిమితం అయ్యా. మొదట్లో ఒకటిరెండు కోతులు మాత్రమే వచ్చేవి. కొంత కాలంగా వందల సంఖ్యలో వస్తున్నాయి. కొంచెం ఆదమర్చినా ఇళ్లు గుల్ల చేస్తున్నాయి. వాటిని ఎక్కడికైనా దూరంగా వదిలేస్తే బాగుంటుంది.

–లోకేష్, ఎస్‌వీపీనగర్

అధికారులు స్పందించాలి



కోతులు పెద్ద సంఖ్యలో వచ్చి ఇంటిముందు ఉన్న చెట్టుపై ఆటలాడుతూ మమ్మల్ని ఇబ్బందులు పెట్టేవి. అవి ఒక్కసారిగా మీదకు వస్తుంటే భయపడి పరుగెత్తబోయి కాలు విరగొట్టుకున్నా. ఇంటిముందు ఉన్న చెట్టును కొట్టేయ్యాల్సి వచ్చింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

–మాధవి, ఎస్‌వీపీనగర్,

కలెక్టర్‌కు విన్నవించాం

కోతుల సమస్యపై జిల్లా కలెక్టర్ వరకు అధికారులందరికి విన్నవించాం. సాయంత్రం పూట అవి చేసే బీభత్సం అంతా ఇంతా కాదు. వందల సంఖ్యలో వచ్చి రేకులపై ఎగురుతూ దుంకుతుంటే ఆ శబ్దానికి భయం వేస్తోంది. అంతేకాక ఇక్కడికి వచ్చే ప్రయాణీకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాటిని అడవిలోకి వదిలితే బాగుంటుంది.

–ముఖేష్‌ఆనంద్, రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్, జడ్చర్ల